క్లుప్తంగా

విజయరాయి అభివృద్ధికి కృషి



జంగాల పేటలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు

పెదవేగి : విజయరాయి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం విజయరాయిలో కొద్ది రోజుల క్రితం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జంగాలులకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే రూ.10 లక్షల వ్యయంతో బుధవారం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా అబ్బయ్య చౌదరి గ్రామంలో కొలువై ఉన్న గంగానమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, జెడ్పీ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి, ఉపసర్పంచ్ లేగల శివ, గొట్టాపు నాగేంద్ర, లేగల గణపతి, బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి, ప్రముఖ న్యాయవాది బైగాని రంగారావు, ఫులగం వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధిపై అవగాహన

భీమడోలు : కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. గుండుగొలనులో బుధవారం ఏలూరు భాస్కర డయాగ్నోస్టిక్స్ అధినేత చేబత్తిన సుధాకర్ జ్ఞాపకార్థం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, గ్లోబల్ గ్రేస్ హెల్త్ వారి సహకారంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన గ్లోబల్ గ్రేస్ హెల్త్ ఆర్గనైజేషన్ రీజనల్ డైరెక్టర్, ఎస్ఆర్ఐ చేబత్తిన జేసుదాస్‌ను అభినందించారు. అనంతరం పరిసర గ్రామాలకు చెందిన 220 మందికి రూ.5వేలకు పైగా విలువ గల కేన్సర్ సమస్యకు సంబంధించిన వైద్య పరీక్షలు, మందులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, సొసైటీ అధ్యక్షుడు వగ్వాల భాస్కర్, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మాజీ ఉప సర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు, గ్రేస్ మేనేజర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీరా మృతి తీరని లోటు

ఉంగుటూరు : దీర్ఘకాలం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తూ ఇటీవల మరణించిన పీరా సేవలు అభినందనీయమైనవని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీరా సంతాప సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన తహసీల్దార్ మాట్లాడుతూ పీరా మృతి తీరని లోటు అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. సంతాప సమావేశంలో ఎంపీడీవో ప్రేమాన్విత, ఈవోపీఆర్ షంషుద్దీన్, డీటీ పోతురాజు, కిరణ్మయి, ఆర్ఐ సత్యనారాయణ, సాయిరమేష్ సర్వేయర్ శ్రీనివాసు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉపాధి అవినీతిపై విచారణ చేయాలి



కలెక్టరేట్‌లోని గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: టీడీపీ ప్రభుత్వ హయాంలో దెందులూరు మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతిపై దర్యాప్తు ప్రారంభించాలని ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, స్థానికేతరులు, పనికి వెళ్లని ధనవంతులకు ఉపాధి మస్తర్లు వేసి నిధులు దారి మళ్లించారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్లెం ప్రసాద్, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం కోరారు. బుధవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి దెందులూరు మండలంలో జరిగిన అవినీతిపై ఫిర్యాదు ఇచ్చామని, విచారణ పారదర్శకంగా చేయించాలని కోరారు. మరోమారు అవినీతికి సంబంధించి ఆధారాలను కలెక్టర్‌కు అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముంగర సంజీవ్, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ ఉన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాంబాబు

దెందులూరు: అలుగులగూడెంలో జగనన్న ఇళ్ల నిర్మాణానికి బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ దెందులూరు అధ్యక్షుడు పోకల రాంబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన లబ్ధిదారుల సమావేశంలో మండల హౌసింగ్ ఏఈ దివ్య మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. స్థానిక వార్డు మెంబర్, వైఎస్సార్ సీపీ నేత కాండ్రు ప్రసన్న రవి, కే.రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, లబ్ధిదారులున్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకు పాలన

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- క్రొవ్విడిలో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు : దేశంలో ప్రభుత్వ పాలన ప్రజల చెంతకు తెచ్చిన ఘనత ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం క్రొవ్విడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు ఇంటింటికి తిరిగి ప్రతి కుటుంబాన్ని పలకరించి ఆయా కుటుంబాలకు గత మూడేళ్లలో ప్రభుత్వ పరంగా అందిన నగదు లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సామాన్యుడు తన సమస్యను చెప్పాలంటే ఎవరికి చెప్పాలో తెలియక అనేక ఇబ్బందులు పడేవారన్నారు. నేడు గ్రామ సచివాలయాలతో ఆ సమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టిందన్నారు. ప్రతి కుటుంబ సమీపంలో వలంటీరు అందుబాటులో ఉన్నారని వారి ద్వారా వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చే అవకాశం కలిగిందన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని శాఖల అధికారులు గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 10 నుంచి 5 గంటల వరకూ అందుబాటులో ఉండటం ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. అధికారుల పనితీరు తెలుసుకుని సమస్యలు ఉంటే పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా స్వయంగా వచ్చినట్లు వారికి వివరించారు. ఈ సందర్భంగా పలువురు పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హత ఉంటే పార్టీలకు, కులాలకు అతీతంగా పింఛన్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెల్లా వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ దాసే యూన్సీ, ఉపసర్పంచ్ ధనుకొండ బుజ్జి, మండల కో ఆప్షన్ సభ్యుడు సలీం, ఆర్‌బీకే చైర్మన్ షకీల్, వక్ఫ్ బోర్డు నేత కామీల్‌జమ, వాకమూడి అప్పారావు తదితరులున్నారు.

స్వచ్ఛ తాగునీరే లక్ష్యంగా నిధులు

జలజీవన్ నిధులతో పల్లెల్లో స్వచ్ఛ తాగునీరు అందించేలా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. క్రొవ్విడి గ్రామంలోని ఉప్పరగూడెంలో శుక్రవారం జలజీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షలతో నిర్మిస్తున్న మంచినీటి పథకం ట్యాంక్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రొవ్విడి ఉప్పర గూడెం ఏర్పడి నాటి నుంచి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం లేకపోవడం బాధాకరమన్నారు. పైప్‌లైన్ ద్వారా సుమారు 2 కిలోమీటర్లు త్రాగునీరు అందించడంతో అనేక ఇబ్బందులు ఇప్పటి వరకూ గ్రామస్తులు ఎదుర్కొన్నారని, ఉప్పరగూడెంలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

దేవాలయ స్థలం తనిఖీ

దెందులూరు: హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని చల్లచింతలపూడి గ్రామంలో దేవాలయ స్థలాన్ని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య తనిఖీ చేశారు. దేవాలయం స్థల వివాదం ఇప్పటికే కోర్టు పరిధిలో ఉంది. ఆ స్థలం ప్రస్తుత పరిస్థితి తనిఖీ చేసి కోర్టుకు నివేదిక ఇవ్వాలని అందిన ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు. నివేదికను లిఖితపూర్వకంగా హైకోర్టుకు నివేదిక అందజేస్తామన్నారు. సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, వీఆర్ఓ చంద్రం తదితరులున్నారు.

రక్షణశాఖ స్థలం పరిశీలన

దెందులూరు: మండలంలోని 7వ మైలురాయి వద్ద రక్షణ శాఖ మంజూరు చేసిన స్థలాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు ఆర్డీవో పెంచల కిషోర్, దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య బుధవారం తనిఖీ చేశారు. రక్షణ శాఖ స్థలం ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి నాలుగువైపులా స్థానికుల నుంచి అభిప్రాయం తెలుసుకుని నమోదు చేసుకున్నారు. రక్షణ శాఖ ఇచ్చిన స్థలం ఆక్రమణకు గురైతే ఎంత వారైనా వారిపై కఠిన చర్యలుంటాయని ఆర్డీవో హెచ్చరించారు. పెదవేగి తహసీల్దార్ నాగరాజు ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- అప్పనవీడులో గడపగడపకు మన ప్రభుత్వం



అప్పనవీడులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: నియోజకవర్గంలోని పేదలైన చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకంలో 6620 మందికి రూ.16.50 లక్షల వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేయడంతో పాటు 6వ విడతగా 2,616 మందికి రుణాలు అందించామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. సమస్యలు పరిష్కరించాలనిఅధికారులను ఆయన ఆదేశించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థ ఉందని ఆయన అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు అందించాలనేది సీఎం జగన్ లక్ష్యమని వారన్నారు. ప్రజలు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఆయన కోరారు. పెదపాడు మండల అప్పన ప్రసాదరావు, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, బత్తుల ఏసురాజు, చిన్నాల యూన్సీ, వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, బుద్దే రామసీత, ఘంటసాల ప్రభాకరరావు ముదుగురు సూర్యనారాయణ, ఏపూరు సర్పంచ్ రామకృష్ణ, స్థానిక నాయకులు బెజవాడ శేఖర్, ఘంటసాల మోషే, తుమ్మల గోపాలకృష్ణ, కొండేలాజరు పాల్గొన్నారు.

సచివాలయ నూతన భవనం ప్రారంభం



సచివాలయ నూతన భవనంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, రాజోలు నియోజకవర్గం పార్టీ పరిశీలకులు గాదిరాజు

నిడమర్రు : ప్రజలకు స్థానికంగా పారదర్శకమైన సేవలు అందించేందించేందుకూ గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మందలపర్రు గ్రామ సచివాలయం నూతన భవనాన్ని, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వ పరంగా అందించే 536 సేవలు స్థానికంగా ఉండే సచివాలయాల్లోనే పొందవచ్చన్నారు. గతంలో మాదిరిగా రైతులు 1బి, అడంగల్, టైటిల్ డీడ్ వంటి కీలక రెవెన్యూ సేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన శ్రమ లేదన్నారు. వీటన్నిటిని స్థానికంగానే పొందవచ్చన్నారు. సచివాలయలతోపాటు ఆయాగ్రామాల్లో సమాంతరంగా రైతు భరోసా కేంద్రాలు, క్లినికల్ సెంటర్లు, గోడౌన్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుబాబు తెలిపారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ సూర్యాకాంతమ్మ త్రిమూర్తిరాజు, ఎంపీడీవో పీవీవీ ప్రకాష్ తదితరులున్నారు.

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి



గణపవరంలో బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రాధాకృష్ణ

గణపవరం: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, తమ పిల్లలను బడికి పంపడంలో తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఎల్ఎస్ కోఆర్డినేటర్ డా.రాధాకృష్ణ అన్నారు. బుధవారం ఆయన గణపవరం మండలంలో పర్యటించి బడిబయట ఉన్న పిల్లలు, డ్రాపవుట్స్ పిల్లలపై ఆరా తీశారు. ఆయా పాఠశాలలను తనిఖీ చేసి బడికిరాని పిల్లల వివరాలను తెలుసుకున్నారు. గణపవరంలోని బస్టాండు, సంతమార్కెట్, బొబ్బిలివంతెన తదితర ప్రాంతాలలో నివసిస్తున్న వలస కుటుంబాలను కలిసి వారి పిల్లలను బడిలో చేర్పాలని అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అమ్మఒడి పథకం, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక తదితర పథకాలను గూర్చి వివరించారు. ఒక్క రూపాయి ఖర్చులేకుండా చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని వారికి తెలియచేసి పిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులను ఒప్పించారు. కార్యక్రమంలో ఎంఈవో పువ్వల శేషు, ఉపాధ్యాయులు ఏఆర్‌కే కుమార్, ఎంఈవో కార్యాలయ సిబ్బంది శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోపు పిల్లలకు టీకాలు వేయించాలి



గణపవరంలో పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం : గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని 9 గ్రామ సచివాలయాల్లో ఏడాది లోపు వయసు గల పిల్లలకు బుధవారం తమ సిబ్బంది టీకాలు వేసినట్లు వైద్యాధికారి సంతోషనాయుడు తెలిపారు. ఏడాది లోపు వయస్సు ఉన్న పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించాలని, 5 ఏళ్లలోపు పిల్లలకు జలుబు, దగ్గు లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి తీసుకురావాలని సూచించారు. గణపవరంలోని నాలుగు సచివాలయాలను ఆయన సందర్శించి టీకాల కార్యక్రమం పరిశీలించారు. వ్యాధినిరోధక టీకాలు, గర్భిణులకు టీడీ ఇంజెక్షన్, ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు, కాల్షియం మాత్రలు గురించి మహిళలకు అవగాహన కల్పించారు. వల్లూరులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించి, పలువురికి వైద్య పరీక్షలుచేసి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్ఎన్ వరలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాజోన్‌పై రైతులకు అవగాహన



ఆక్వా రైతులకు అవగాహన కల్పిస్తున్న మత్స్యశాఖ అధికారి

గణపవరం : ఆక్వా సాగుచేసే రైతులంతా తమ చెరువులు ఆక్వాజోన్‌లో ఉన్నదీ లేనిదీ పరిశీలించుకుని ఆక్వాజోన్‌లోకి చేర్చడానికి దరఖాస్తు చేసుకోవాలని గణపవరం మత్స్యశాఖ అధికారి గణేశ్వరరావు అన్నారు. బుధవారం గణపవరంలో ఆక్వాజోన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఆక్వా జోన్‌లో ఉన్నవారికి ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయన్నారు. రైతులు తమ చెరువుల సర్వే నంబర్లు ఆక్వా జోన్‌లో ఉన్నదీ లేనిదీ పరిశీలించుకోవాలన్నారు. భవిష్యత్తులో చెరువులు తవ్వాలనుకునే రైతులు కూడా తమ పొలాల సర్వే నంబర్లను ఆక్వాజోన్‌లోకి మార్చుకోవాలని, అప్పుడే చెరువుల తవ్వకాలకు అనుమతులు వస్తాయని చెప్పారు. రైతులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయకురాలు షర్మిలాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సల్ఫర్ సమస్యతోనే కుళ్లుతున్న వరి దుబ్బులు



దుద్దేపూడిలో కుళ్లిన వరి దుబ్బులను పరిశీలిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త పి.ఫణికుమార్

భీమడోలు : దాళ్వా పొలాల్లో సల్ఫర్ గాయం సమస్య నివారణకు రైతులు వ్యవసాయశాఖ సూచనలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏలూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.ఫణికుమార్ కోరారు. మండలంలోని పోలసానిపల్లి, దుద్దేపూడి గ్రామాల్లో దాళ్వాలో వరి ఊడ్చిన చేలు చనిపోతున్నాయని, దుబ్బులు కుళ్లిపోతుండడంతో రైతులు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనితో ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.ఫణికుమార్‌తో ఏవో ఎస్‌పీపీ ఉషారాణితో కలిసి పోలసానిపల్లి, దుద్దేపూడి గ్రామాల్లోని వంట పొలాలను సందర్శించారు. కుళ్లిన దుబ్బులు, చేలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. సార్వా, దాళ్వా పంటకు మధ్య తక్కువ సమయంలో వరి నాట్లు వేయడం, సరిగ్గా దమ్ము చేయకపోవడంతో మోడులన్నీ సరిగ్గా కుళ్లకపోవడం వల్ల గ్యాస్ ఏర్పడి బుడగలు వస్తుంటాయని, నిర్లక్ష్యం చేస్తే వేరు వ్యవస్థ పూర్తి దెబ్బతింటుందని సల్ఫర్ గాయం సమస్య ఏర్పడిందని రైతులకు ఆయన వివరించారు. వెంటనే పొలాల్లోని వెంట్రుక వాసి వరకు నీరు ఉంచి మిగిలిన నీటిని బయటకు తీసివేయాలని సూచించారు. ఈ తరుణంలో సల్ఫర్ ఎరువులను వాడవద్దని కోరారు. తద్వారా సల్ఫర్ గాయం సమస్య పరిష్కారమవుతుందన్నారు. అదే మండలంలోని కాండం తొలుచు పురుగు ఉన్నందున చేలల్లో ఉండడాన్ని గమనించామన్నారు. రైతులు కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరానికి 8 కేజీల చొప్పున పిచికారి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో సభ్యుడు రూఫస్, వ్యవసాయశాఖ సహాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించేలా ప్రభుత్వ కృషి



పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ భారతి

పెదవేగి : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించిందని జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు బుధవారం అన్నారు. 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాలబాలికల బేస్‌బాల్, టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్, సెలెక్షన్స్ ఈనెల 11 నుంచి 13 వరకు పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో ప్రారంభమయ్యాయి. రాష్ట్రస్థాయి పోటీలను జెడ్పీ వైస్ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులతో స్పోర్ట్స్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ టోర్నమెంట్‌కి టెన్నికాయిట్ రాష్ట్ర పరిశీలకులుగా వి.ఎస్.వి.కృష్ణారావు, బేస్‌బాల్ రాష్ట్ర పరిశీలకులుగా బి.వి.వి.ఎస్.వి.ప్రసాద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ బి.ప్రభాకర్ రావు, ఎస్‌జీఎఫ్ అడిషనల్ సెక్రటరీ ఎం.మనోహర్, స్టేట్ బేస్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం. అచ్యుత్, స్టేట్ అసోసియేషన్ ట్రెజరర్ ఆదిరెడ్డి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎం.భారతి, టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తిరుమల రావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కుమార్, డి రాజేంద్రప్రసాద్, పీఈటీ గురుమూర్తి పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి

ఉంగుటూరు : క్రీడలను ప్రోత్సహిస్తే యువత కోడిపందేలు, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లరని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం నారాయణపురం బాపిరాజు 'స్టేడియంలో పోలీసులు, సమతా గేమ్స్ అండ్ స్పోర్ట్స్' అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. యువత సన్మార్గం వైపు నడవడానికి ఇదొక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంట శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, చేబ్రోలు ఎస్సై కె.స్వామి, సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎంఈవో నిర్లక్ష్య వైఖరిపై ఫిర్యాదు

భీమడోలు : పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం ప్రాథమిక పాఠశాల టీచర్, వికలాంగుడు ఎ.పురుషోత్తంకు పీహెచ్‌సీ ధృవీకరణ పత్రం ఉన్నప్పటికీ అతనికి అందించాల్సిన 9 నెలల అలవెన్స్ ఇవ్వకపోవడానికి మండల విద్యాశాఖాధికారి నిర్లక్ష్యమే కారణమని, అదే విధంగా ఇటీవల టీచర్ల సర్దుబాటు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డెప్యూటేషన్లు చేశారని జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు జీజే రవికాంత్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆ ప్రతులను రవికాంత్ విలేకరులకు అందజేశారు. ఎంఎంపురం ఎస్‌జీటీ పురుషోత్తంకు పీహెచ్‌సీ సర్టిఫికెట్ పొందినప్పటికీ 9 నెలల పీహెచ్‌సీ అలవెన్స్ బిల్లులు చేయకపోవడంతో సుమారు రూ.15వేలు ఆర్థికంగా నష్టపోయాడని, ఆ కుటుంబం చాలా ఇబ్బందులు పడుతుందన్నారు. ఈ విషయంపై గతంలోనే పలు సార్లు ఫిర్యాదు చేశామన్నారు. అయితే సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ నేటికి ఆ బిల్లును మండల విద్యాధికారి చేయలేదని విమర్శించారు. కాగా ఇటీవల ఉపాధ్యాయులు సర్దుబాటులో భాగంగా ప్రభుత్వ నిబంధనలకు త్రిలోదకాలిచ్చి ఎంఈవో తనకు ఇష్టం వచ్చినట్లు డెప్యూటేషన్ చేశారని మండల అధ్యక్షుడు జీజే రవికాంత్, ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మరోసారి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై మండల విద్యాధికారి డి.సాంబశివరావును వివరణ కోరగా యూటీఎఫ్ నేత చేసిన ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఆ ఆరోపణల్లో నిజం లేదని వివరించారు.

యువత జూద క్రీడలు వీడాలి



పూళ్లలో క్రీడాకారులకు సూచనలందిస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు : యువత జూద క్రీడలు వీడి సాంప్రదాయ ఆటలతో సంక్రాంతిని జరుపుకోవాలని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, నాయకులు కందులపాటి అయ్యప్పలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రికెట్ టీం సభ్యులకు ఎస్సై పలు సూచనలు చేశారు. ఈ పోటీలు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గొండు కృష్ణచైతన్య, గంటా శ్రీనివాసరావు, బొల్లారపు జ్ఞానరమ్య పవన్, హెచ్ఎం ఎస్‌బీటీ సుందరి, ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

గణపవరం : గణపవరం మండలంలో కోడిపందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని గణపవరం ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గణపవరం మండలం కాశిపాడు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించకుండా గ్రామ నిఘాబృందాల సభ్యులు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రముఖులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. జూదాలు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. గ్రామాలలో బరులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బరుల ఏర్పాటుకు స్థలం ఇచ్చిన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ జంపన పద్మావతి రమేష్‌రాజు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాటపై నిఘా ముమ్మరం

దెందులూరు: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాటలను అడ్డుకునేందుకు నిఘా ముమ్మరం చేశామని, ఎవరైనా జూదాలకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. బుధవారం గాలాయగూడెం గ్రామ సచివాలయంలో చట్టాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు అంబటి లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట వెంకన్న, పెద్దిశెట్టి బసవయ్య, గంటా కోటేశ్వరరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

89 మంది బైండోవర్

దెందులూరు తహసీల్దార్ కోర్టులో బుధవారం 8 మందిని బైండోవర్ చేశామని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు, హెడ్‌కానిస్టేబుల్ రామభద్రయ్య అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, పేకాట నివారణలో భాగంగా ఇప్పటి వరకు మండలంలో 17 పంచాయతీల్లో 89 మందిని బైండోవర్ చేసినట్టు తెలిపారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

పెదపాడు: యువత జూదం వైపు వెళ్లకుండా ఉండేందుకు గ్రామాల్లో సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తెలిపారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఘనంగా ముగిశాయి. పెదపాడు ఎస్సై బీ నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వేంపాడు, పెదపాడు, వడ్డిగూడెం, వసంతవాడ గ్రామాలకు చెందిన 8టీములు పాల్గొన్నాయి. వడ్డిగూడెం టీమ్ ప్రథమ స్థానం సాధించగా, వేంపాడు టీమ్ రెండో స్థానం సాధించింది. విజేతలకు అధికారులు నగదు బహుమతులు, షీల్డులు అందించారు. ఈకార్యక్రమంలో పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రోజ్లిన్, అంపైర్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ పోటీలో 8 టీములు పాల్గొన్నాయి. పెదపాడు జట్టు ప్రథమం స్థానం, వడ్డిగూడెం వేంపాడు జట్టు రెండోస్థానం సాధించాయి.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

దెందులూరు: ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశాల మేరకు కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జీఎస్ఎస్ఎల్‌వీ శర్మ అధ్యక్షతన దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జక్కుల సురేష్, ఏఎస్సై రామారావు, పోలీస్ సిబ్బంది రాజు ఉన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

భీమడోలు : భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కొల్లేరు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరిగాయి. భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. బాలబాలికలు భోగి మంటలు వేశారు. బాలికలు నృత్య ప్రదర్శన చేశారు. రంగవల్లుల పోటీలు జరిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు.